సీరియల్



ప్రతాప రవిశంకర్

(గత సంచిక తరువాయి)

ఆంద్రూస్ చెప్పినదంతా విని నాయకుడు మళ్ళీ పెద్ద రంకె వేశాడు. తలను ఆంద్రూస్‌తో ఏకీభవించనట్టుగా అటూ యిటూ ఆడించాడు.

తర్వాత యేదో చెప్పాడు.

"ఐయామ్ సారీ భారత్.... నాయకుడు మీ సంజాయిషీని కొట్టేశాడు. నాగరికుల ఆచారాలతో మాకు సంబంధం లేదు. ఈ దీవి మాది. మా పూర్వీకులనించీ వస్తున్న ఈ ఆచారాన్ని మీరు తెలియక చేసినంత మాత్రాన మేము సరిపెట్టుకోలేము. పాతిపెట్టబడిన మనుషుల ప్రేతాత్మ యిక్కడే గాలిలో తిరుగుతూ టకారాజాతి మనుషులను బాధిస్తూ వుంటుంది. అందువల్ల దానికి ప్రాయశ్చిత్త కార్యక్రమం యేర్పాటు చెయ్యక

తప్పదు."

"ప్రాయశ్చిత్త కార్యక్రమమా!" అదిరిపడి అడిగాడు భారత్.

"అవును భారత్ .... చెప్పాను కదా దీని పర్యవసానం చాలా ఘోరంగా వుంటుందని. మీ కెలా చెప్పాలో నాకు తెలీటంలేదు. ఐనా చెప్పక తప్పదు."

ఆగిపోయాడు ఆండ్రూస్.

అంతా గుండెలను అరచేత పట్టుకుని వున్నారు ఆండ్రూస్ చెప్పబోయే ఆ ప్రాయశ్చిత్త కార్యక్రమం యేమిటో తెలుసుకుందామని.

భారత్ కు చెమటలు క్రమ్మాయి ఆ కార్యక్రమం యేమిటో తెలియక ముందే.

"ఏమిటా కార్యక్రమం?" అడిగేసింది సెల్లా.

"చెబుతాను. దయచేసి నన్ను నిందించకండి. నేనూ ఒకప్పుడు మీ లాంటి నాగరికుడినే. ఐనా ప్రస్తుతం ఈ టకారాజాతి మనుషుల్లో ఒకడికిందే లెక్క. నాయకుడి ఆజ్ఞలను పాటించటం యిక్కడి ప్రతి ఒక్క మనిషి మొదటి కర్తవ్యం. ఇప్పుడు నా కర్తవ్యం యేమిటంటే మీ మనిషిని ఈ దీవిలో పాతిపెట్టిన నేరానికి ప్రాయశ్చిత్తం సక్రమంగా నిర్వర్తించే బాధ్యతను నాయకుడు నాకు అప్పగించాడు. అందుకే నే నింతగా బాధపడు తున్నాను" అంటూ ఆగాడు ఆండ్రూస్.

టకారాజాతి మనుషులంతా వీళ్ళందరినీ శత్రువులను చూసినట్టు చూస్తున్నారు. ఆ దీవిలో ఓ మనిషి ప్రేతాత్మ తిరిగేలా చేసిన నాగరికులను వాళ్ళు ద్వేషంతో చూస్తు న్నారు.

ఆ చూపులను—వాళ్ళ మనోభావాలను అంతా పసి

కట్టారు. అలా జరిగినందుకు వాళ్ళకు బాధ కలిగింది.

అలాంటి మూఢ నమ్మకాలతో — అర్థంలేని ఆచారాలతో తమచుట్టూ ఓ గీత గీసుకుని దాని మధ్యనే బతుకుతున్న ఆ మొరటు మనుషులను చూస్తుంటే జాలి కలిగింది.

కాని — ప్రస్తుతం తాము యే పరిస్థితుల్లో వున్నారో తల్చుకుంటే వాళ్ళమీద వాళ్ళకే జాలి కలిగింది.

చివరగా భారత్ అన్నాడు. "ఆ ప్రాయశ్చిత్త కార్యక్రమం యేమిటో చెప్పండి ఆండ్రూస్."

"మీలో ఎవరో ఇద్దరు మనుషులను మాకు యిచ్చెయ్యాలి. ఆ ఇద్దరు మనుషులనూ మా కపాలీ అంటే ఈ టకారాజాతిని కాపాడే దేవత ఎదుట తలలు నరికి ఆ మాంసాన్ని వండి దేవతకు నివేదన చేసి ఆ మాంసాన్ని ఈ గూడెంచుట్టూ విసిరేస్తాం...."

"వీల్లేదు. దారుణం.... మేం ఒప్పుకోం" ఆండ్రూస్ ప్రాయశ్చిత్త కార్యక్రమం వింటూనే ఒక్కసారిగా అంతా శివమెత్తిన వాళ్ళలా పెద్దగా అరిచారు ఆవేశంతో....

నాయకుడు కలవరపడి యేదో అన్నాడు.

ఆండ్రూస్ మళ్ళీ చెబుతూ "మీ అరుపులు నాయకుడికి అర్థం అవకపోయినా నేను చెప్పినదానికి మీరు మీ అసమ్మతిని తెలియజేస్తున్నట్టుగా ఆయన గ్రహించాడుట. అలాంటి పక్షంలో మీ అందరినీ శిక్షించే అధికారం టకారాదీవి నాయకుడిగా తనకు వుందని తెలియజెయ్యమంటున్నాడు...." అన్నాడు.

"ఏమైనా ఇది అన్యాయం మిస్టర్ ఆండ్రూస్. మీరు కూడా ఓ నాగరిక మనిషి అయివుండీ సాటి మనుషులకు

కేవలం కొంతమంది అనాగరికులతో కలిసి హాని చెయ్యాలనుకోటం దారుణం. ఇంతకు మించిన అన్యాయం ఇంకోటి వుండదు. ఇందులో మా తప్పేమిటో మీకు తెలుసు కదా! ఐనా మీరు తగిన విధంగా చెప్పి నాయకుడిని కన్విన్స్ చెయ్యటానికి యెందుకు గట్టిగా ప్రయత్నించరు?"

బాధగా అన్నాడు భారత్. అతని గుండె దహించుకు పోయింది. ఎందుకంటే ప్రాయశ్చిత్త కార్యక్రమంగా తమలో ఇద్దరు మనుషులను ఇలా తలలు నరుకుతామని అంటారని వూహించలేదు. ఇలాంటి పరిస్థితులు ఎదురవుతాయని ఏ మాత్రం ముందుగా వూహించగలిగినా ఆ జాతి మనుషులు కనిపించినప్పుడే పోరాటం జరిపి చావో, బతుకో తేల్చుకునే వాళ్ళు.

భారత్ అంత పరుషంగా మాట్లాడేసరికి ఆంద్రూస్ మొహం కోపంతో ఎర్రబడింది.

ఐనా వీలైనంత శాంతంగానే "డియర్ ఫ్రెండ్స్! నేను యిక్కడ ఏ పరిస్థితిలో యెలా బతుకుతున్నానో మీరంతా చూశారు కదా! నేను నిమిత్తమాత్రుడిని. నాయకుడి ఆజ్ఞలకు బద్ధుడిని. నా యిష్టప్రకారం ఇక్కడ యేదీ జరగదు. ఈ దీవి నాయకుడే సర్వాధికారి. ఈ శవాన్ని పాతిపెట్టిన తప్పును నాయకుడే కాదు యీ గూడెంలో పసిపిల్లాడు కూడా క్షమించలేడు. అందుకు ప్రాయశ్చిత్తం జరిగేవరకూ వీళ్ళు నిద్రపోరు. ఆ నమ్మకం అలాంటిది.

తన దీవిలో జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా కపాలీకి అంటే వీళ్ళను కాపాడే దేవతకు నరబలి నివేదన జరగందే ఆమె వాళ్ళను కాపాడదని వీళ్ళందరి

నమ్మకం. ఇందుకు భంగం జరగటానికి వీల్లేదు. అందువల్ల మీరంతా నన్ను క్షమించండి. ఇక ఈ విషయం గురించి మీరు యెంతగా నాతో వాదించినా అందువల్ల కొంచెం కూడా ప్రయోజనం లేదు. కాబట్టి త్వరగా మీలో ఎవరో ఇద్దరు మనుషులను వీళ్ళకు అప్పగించండి" అని ముగించాడు.

అందరు ఒకరినొకరు భయం భయంగా చూసు కున్నారు.

ఎవరో ఇద్దరు!

ఎవరా ఇద్దరు?

ఎవరు ఎవర్ని వాళ్ళకు అప్పగిస్తారు? ఇక ఆ తలలు నరికే ప్రాయశ్చిత్తం ఆగేది కాదని అందరికీ అర్థమై పోయింది.

అందుకే ఎవరికి వారే మృత్యుభయంతో వణికి పోయారు. అందరి కళ్ళలో ప్రాణభయం తొణికింది.

ఆంద్రూస్‌తో "క్షమించండి. మాలో ఇద్దర్ని అప్ప గించమంటే ఎవర్ని అప్పగించాలి? ఆ పని మేము చెయ్య లేము" అన్నాడు.

అందుకు ఆంద్రూస్ "నువ్విలా అంటావని నాకు తెలుసు. నువ్వే కాదు నీ స్థానంలో నేను వున్నా ఇలాగే అంటాను. నిజమే. మరో మనిషి ప్రాణాలు తియ్యమని ఎవరూ ఎవర్ని ముందుకు నెట్టరు. ఐతే—ఇక్కడ అందుకు కూడా ఒక పద్ధతివుంది. మీరంతా వరుసగా నిలబడాలి. కొంచెం దూరంలో మా దగ్గరవున్న రెండు మెడపాముగు జంతువులను వదులుతాం. అవి యెవరి దగ్గరకు వచ్చి నిలు చుంటే ఆ యిద్దరినీ ప్రాయశ్చిత్తానికి తలలు నరకటానికి తీసుకుంటాం...." అని చెప్పాడు ఆంద్రూస్ నాయకుడి

తరఫున.

టెల్లాకు మొదటిసారిగా ప్రాణభయం కలిగింది. ఆమెకే కాదు, భారత్ కు కూడా. అప్పటివరకూ మిగిలిన మనుషులందరూ భయంతో, దిగులుతో వణికిపోతున్నా వాళ్ళిద్దరే మిగిలినవాళ్ళకు ధైర్యం చెప్పారు. కాని యీ మెడపొడుగు జంతువులను వదిలి ఆ మనుషుల తలలు నరుకుతాన నేసరికి ప్రతి ఒక్కరితో పాటు ఆ ఇద్దరికీ ప్రాణభీతి కలిగింది.

టెల్లా తను తొందరపడి ప్లేన్ లో రివాల్వర్ తీసి షూట్ చేసినందుకు అప్పుడు పశ్చాత్తాప పడింది. కాని అందువల్ల ఉపయోగం యేమిటి?

ఒక రకంగా యిప్పుడు ఈ పరిస్థితి యెదురవటానికి పూర్తిగా తను—భారత్ యిద్దరే కారణం.

కనీసం హాంకీల్ ను వాళ్ళంతా మీదపడి కొడుతున్నప్పుడు—చంపుతామన్నప్పుడు వారించకుండా వున్నా బావుండేది. చనిపోయిన హాంకీల్ ను అక్కడే వదిలి వచ్చేవాళ్ళు. అతని శరీరాన్ని యే జంతువులో తినేసి వుండేవి. అప్పుడీ సమస్య ఎదురయ్యేది కాదు.

భారత్ కూడా యిలాగే ఆలోచిస్తున్నాడు.

వాళ్ళందరికీ యీ పద్ధతి గురించి చెప్పినట్టుగా ఆంద్రూస్—నాయకుడితో చెప్పాడు.

అంతా విని నాయకుడు తన చుట్టూ వున్న మనుషులతో యేదో చెప్పాడు.

ఒక్కసారి వాళ్ళంతా సంతోషంతో అరిచారు. ఆనందంతో ఎగిరారు.

వాళ్ళెంత రాక్షసులో వాళ్ళ ఆనందం—ఆ ఉత్సాహం చూస్తుంటేనే నాగరికులకందరికీ అర్థమై

పోయింది.

అంద్రూస్ విచారవదనంతో చెప్పాడు—

“చూశారు కదా ఈ జాతివాళ్ళ ఉత్సాహం — సంతోషం? మెడపొడుగు జంతువులతో మీలో ఇద్దరిని ప్రాయశ్చిత్తానికి ఎన్నిక చేస్తున్నారని చెప్పేసరికి వీళ్ళంతా ఆనందపడుతున్నారు. ఈ సంఘటనతో వీళ్లెంత మూర్ఖులో వీళ్ళ మూఢ నమ్మకాలు యెంత బలమైనవో అర్థం చేసుకోండి. అంతా మీ దురదృష్టం. అందువల్లనే మీరు ప్రయాణం చేస్తున్న విమానం ఈ దీవిలో కూలి పోయింది.

అలా కాకుండా సముద్రంలో కూలిపోయినా మీరంతా ఒక్కసారే మరణించేవాళ్ళు. అప్పుడు మీకీ మృత్యువు ఎవర్ని వరిస్తుందో అనే ఉత్కంఠ వుండేది కాదు. ఐయామ్ వెరీ వెరీ సారీ ... నన్ను దయచేసి మనస్ఫూర్తిగా క్షమించండి. ఐయామ్ హెల్ప్‌లెస్. ఐయామ్ జస్ట్ టాయ్ ఇన్ ది హేండ్సాఫ్ దిస్ బ్లడీ లీడర్ ....ఇప్పటికే బాగా ఎండెక్కుతోంది. మీరంతా లేచి ఆ పొడుగ్గా వున్న చెట్టు దగ్గరకు వెళ్ళి నిలుచోండి ....” అన్నాడు.

అంద్రూస్ యెంతగా విచారాన్ని వ్యక్తపరిచినా, ఎన్నిసార్లు క్షమాపణలు చెప్పుకున్నా ఆ విచారం ఆ క్షమాపణలు వారిలో యే ఒక్కరికీ వూరటను కలిగించలేకపోయాయి. ఎందుకంటే ఆ మెడపొడుగు జంతువులు యెవరిదగ్గరకు వచ్చి నిల్చుంటాయో తెలీదు. ఎవర్ని మృత్యువు శాశ్వతంగా తన ఒడిలోకి లాక్కుటుందో తెలీదు. ఎవరి తలలు తెగ నరకబడుతాయో తెలియదు.

ఎవ్వరూ అక్కడినించి కదల్లేదు.

నాయకుడు ఆండ్రూస్‌ను చూశాడు. ఆండ్రూస్ వాళ్ళందర్నీ మరోసారి ఆ పొడుగాటి చెట్టుదగ్గరకు వెళ్ళి నిలబడవలసిందిగా కోరాడు.

ముందుగా భారత్ కదిలాడు. అతని వెనుక సెల్లా.... తర్వాత ముసలాయన. ఆయన వెనుక ముగ్గురు స్త్రీలు. మిగిలిన అందరూ—

అంతా మవునంగా ఏడుస్తున్నారు.

"చావు గురించి నాకు భయంలేదు. కాని నా చెల్లెలు ఆరోగ్యం యెలావుందో అనే నాకు బెంగగా వుంది. గాడీజ్ కైండ్‌లెస్. డిసీజ్ మై ఫేట్" అంటూ ఓ స్త్రీ నుదుటిమీద కొట్టుకుంది కసిగా—యేడుస్తూ....

ఐనా యెవ్వరూ చెయ్యగలిగింది యేదీ లేదు. ఎవరికి వారే నిస్సహాయ స్థితిలో వుండిపోయారు.

• • •

టకారా మనుషులంతా వరుసగా నిల్చున్న వాళ్ళందర్నీ కుతూహలంగా చూస్తున్నారు.

వాళ్ళందరికీ యెంతో ఆసక్తికరంగా వుంది.

చాలా యేళ్ళ తర్వాత ఆ దీవిలో మెడపొడుగు జంతువులతో తలలు నరకటానికి మనుషులను ఎన్నిక చేసుకోవటం మళ్ళీ ఇదే.

వాళ్ళకు యెదురుగా కొంచెం దూరంలో పాంకీల్ శవం గురించిన వార్తను మోసుకు వచ్చిన టకారజాతి మనుషులు నిలబడి వున్నారు. వారి పక్కనే ఆండ్రూస్ నిలబడి వున్నాడు.

నాయకుడికి ఆనందంగా వుంది.

ఎన్నో రోజుల తర్వాత తన దీవి కపాచీకి నరమాంస నివేదన చెయ్యబోతున్నారు.

అందరికీ కళ్ళు తిరుగుతున్నట్టుగా అనిపించింది. భూమి రెండుగా చీలిపోతున్నట్టు అంతా ఆ చీలికలోకి దిగిపోతున్నట్టుగా అనిపించింది.

ఎదురుగా నాలుకలు చాచుకుని పిల్లి కళ్ళతో అసలే పొడుగ్గా ఉన్న మెడలను మరింత పొడుగ్గా ముందుకు చాచి మరికొన్ని క్షణాల్లో మీసుకు రాబోతున్న మృత్యువులా వున్నాయి ఆ మెడపొడుగు జంతువులు.

ముసలాయన—ఆ స్త్రీ ఏడుస్తున్నారు.

“ప్లీజ్.... నేను ముసలివాడిని....నన్ను ఈ ఎన్నిక నించి వదిలి వేయండి” రెండు చేతులూ జోడించి అంద్రూస్‌ను, నాయకుడినీ చూస్తూ యేడుస్తూనే ప్రార్థించాడు ఆయన.

అంద్రూస్ తల తిప్పుకున్నాడు.

నాయకుడు తన ఐదుగురు మనుషులకూ యేదో చెప్పాడు. అంతే, వెంటనే వాళ్ళు ఆ మెడ పొడుగు జంతువుల తోకలను రెండుసార్లు దువ్వి పక్షి కూతల్లాగా చిత్రమైన అరుపులు అరిచి వాటికి ఎదురుగా వరుసగా నిలబడివున్న మనుషులను చూపించి వాటిని ముందుకు నెట్టారు.

తోకలను వూపుకుంటూ అవి రెండూ బద్ధకంగా ఒక్కో అడుగు వేస్తూ ముందుకు కదిలాయి.

ఆ జంతువులు కదిలిన వెంటనే వాళ్ళందరి కళ్ళలోనూ మృత్యు భయం క్షణాల్లో యెంతగానో పెరిగిపోయింది.

ఎవరికివారే ఆ జంతువులు తమ దగ్గరకు వచ్చి నిలుచోకుండా ఉండాలని మనసులోనే కనుపించని దేవుడిని ప్రార్థించసాగారు.

టకారాజాతి వాళ్ళకు అదో గొప్ప వినోదంగా వుంది.

వాళ్ళు కేరింతలు కొడుతున్నారు. రకరకాల ధ్వనులతో వాళ్ళ సంతోషాన్ని బయట పెడుతున్నారు.

ఆ జంతువులు ముందుకు కదులుతున్నాయి.

టెల్లాకు ఆ దీవి మొత్తాన్ని బాంబులతో పేల్చి సమూలంగా నాశనం చెయ్యాలనిపించింది ఆ క్షణంలో.

మెడపొడుగు జంతువులు సగందూరం నడిచాయి. అవి నడుస్తుంటే వాటి నాలుకలు నోట్లోకి పోయి బయటకు వస్తున్నాయి. పొడుగ్గా ఉన్న తోకలు పట్టు కుచ్చులా వూగుతూ భూమిని రాసుకుంటూ వెళుతున్నాయి.

అందరికీ గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. వాళ్ళ ముఖాలలో ప్రేతకళ తాండవిస్తోంది.

తమకు ఎంతో రుచిగా వండిన నల్ల మృగం మాంసాన్ని పెట్టి వెదురు ముక్కల పాత్రలతో ఎర్రటి పానీయాలను యిచ్చి యెంతో ఆదరంగా ఆతిథ్యమిచ్చిన ఈ మనుషులు కనీసం కొంచెమైనా జాలి — దయ అనే ఆలోచన లేకుండా తమ తలలు నరకటానికి ఎన్నికకై జంతువులను వదిలి ఇలా కేరింతలతో ఉత్సాహపడుతున్నారంటే వాళ్ళ గురించి యేమని అనుకోవాలో వాళ్ళలో యే ఒక్కరికీ అర్థంకాలేదు.

ముసలాయన ప్రార్థనను యెవ్వరూ పట్టించుకోలేదు.

ఆ స్త్రీ యేడుపును యెవ్వరూ ఆలకించలేదు.

అలాంటి సమయంలో—

జంతువులు అప్పటివరకూ పక్క పక్కనే నడిచి అక్కడ రెండూ ఒకదానికొకటి దూరమై పోయాయి.

ఒకటి భారత్ ఎదురుగా వస్తున్నట్టు అనిపించింది. రెండో జంతువు టెల్లా యెదురుగా వస్తున్నట్టు అనిపిం

చింది.

ఎలాంటి ప్రమాదాన్నైనా యెదుర్కోటానికి సిద్ధపడే సెల్లా తన యెదురుగా నాలుకను ఊపుతుంటూ పిల్లి కళ్ళతో వస్తున్న ఆ పెద్దపాదుగు జంతువును చూడగానే భయంతో గజగజలాడిపోయింది.

ఊహు....తను చావకూడదు. తన చావే నిజంగా నిజమయితే తను ఒంటరిగా చావదు. టకారజాతి మనుషులను కనీసం పదిమందిని చంపి ఆ తర్వాత చస్తుంది.

ఆ క్షణాల్లోనే తనకు సూటిగా విలాసంగా తోకను కదులుస్తూ వస్తున్న ఆ జంతువును చూస్తుంటే కెరోన్ ఆ జంతువు రూపంలో తనని మృత్యువుకు ఎరగా వేయటానికి అలా వస్తున్నట్టుగా భారత్‌కు అనిపించింది.

సందేహంలేదు. ఇవే తనకు ఆఖరి క్షణాలు. కెరోన్ శాపం తనను వదల్లేదు. ఆమె మరణ సమయంలో విధించిన శాపం వృధాగాపోయే అవకాశంలేదు.

దీనికంతటికీ కారణం—సెల్లా.

తొందరపడి కెరోన్‌ను రివాల్వర్‌తో కాల్చి చంపింది.

నిజంగా ఇది కెరోన్ శాప ఫలితమే అవకపోతే ఈ పిల్లికళ్ళ జంతువు తన యెదురుగానే ఎందుకు వస్తుంది? ఇంతమంది వరుసగా నిలబడి వున్నప్పుడు—

తన మీదనే కక్ష కట్టినట్టు తననే చూసుకుంటూ ఇలా యెందుకు వస్తుంది?!

కెరోన్....నన్ను క్షమించు....

అతని ప్రార్థన ఆ జంతువుకు వినిపించి ఉండదు. అది మరింత ముందుకు అతనికి సూటిగానే వచ్చింది.

భారత్‌లో ఇక తను మృత్యువునించి తప్పించుకో

గలనే నమ్మకం పోయింది. ప్రాణభయంతో కొంచెం పక్కకు కదలబోయాడు కాని వీలు కాలేదు. అతని వెన్నులో బల్లెం వాడియైన మొన గుచ్చుకుంది.

గమనించనే లేదు. ఎప్పుడు వచ్చి నిల్చున్నారో ఆ జాతి మనుషులు. ఒక్కొక్కరి వెనుక ఒక్కో మనిషి బల్లెం తీసుకుని యెవ్వరూ కదలటానికీ, పారిపోవటానికి వీల్లేకుండా పట్టుకుని నిల్చున్నారు.

స్టెల్లా కూడా సరిగ్గా ఇలాంటి పరిస్థితిలోనే వుంది. ఆ జంతువు తన యెదురుగానే వస్తోందని నిర్ధారణ చేసుకున్న తర్వాత కదలటానికి ప్రయత్నించి విఫలమైంది.

ఆ పొడుగు తోక జంతువులు వరుసగా నిల్చున్న మనుషులకు సమీపంగా వచ్చేశాయి. అందరూ వణుకుతూ తమ ఇష్టదైవాలను ప్రార్థించుకోసాగారు.

స్టెల్లా—భారత్ భయంతో కళ్ళు మూసుకున్నారు.

కాని—స్ప్లిట్ సెకండ్‌లో

ఎ ఛేంజ్....

పట్టుకుచ్చులాంటి తోక కలిగివున్న ఆ జంతువులు రెండంగల్లో వెళ్ళి యిద్దరు మనుషుల యెదురుగా వెళ్ళి నిల్చుండిపోయాయి నాలుకలు ఆడిస్తూ.

ఆ ఇద్దరూ స్త్రీలు....వాళ్ళే ఆ రాత్రి ఏడుస్తున్న స్త్రీని ఓదార్చినవాళ్ళు....ఇప్పుడు మృత్యువు ఆ ఇద్దరినే వరించింది.

టకారాదీవి మనుషులు ఆనందంతో పెద్దగా అరిచారు. నాయకుడు ఏవో ఆజ్ఞలు అప్పటికప్పుడే జారీ చేశాడు. కళ్ళు తెరిచారు భారత్—స్టెల్లా.

ఏదో గొప్ప అగాధంలోకి పడబోయి వెంట్రుక

వానిలో తప్పించుకున్న భావన ఆ క్షణంలో ఆ ఇద్దరికీ కలిగింది.

గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

మృత్యువు తమను వదిలినందుకు సంతోషమనిపించినా మరో ఇద్దర్ని—ఆ ఇద్దరూ స్త్రీలనే కౌగిలించుకున్నందుకు భరించలేని విచారం కలిగింది.

ఇక ఆ స్త్రీల పరిస్థితి? ఆ జంతువులు తమ ఎదురుగా వచ్చి నిలబడినప్పుడే ఇద్దరికీ భయంతో స్పృహ తప్పి పోయింది. పడబోతున్నప్పుడు పక్కనే ఉన్న మనుషులు ఆ ఇద్దరినీ పట్టుకున్నారు.

స్పృహ తప్పిన ఆ ఇద్దరూ తిరిగి స్పృహలోకి రావటానికి ఎంత టైము తీసుకునేదో తెలీదు కాని ఆ టకార జాతి మొరటు మనుషులు మాత్రం కేవలం పదినిమిషాల్లోనే వాళ్ళకు స్పృహవచ్చేలా చేశారు.

అప్పుడు తెలివిలోకి వచ్చిన తర్వాత ఆ స్త్రీలు హృదయవిదారకంగా యేడ్చారు, విలపించారు, రోదించారు. ఐనా ఆ రాతి గుండెలు కరిగే అవకాశమేలేదు.

స్పృహ పోయినప్పుడే ప్రాణాలుకూడా పోయి వుంటే బావుండేదని అనుకున్నారు వాళ్ళు. కాని అలా జరగలేదు. ఒకవేళ నిజంగానే అలా జరిగి వున్నట్లయితే ఆ జాతి ఆచార ప్రకారం మరో ఇద్దరి ఎన్నిక సరిగ్గా అదేవిధంగా జరిగివుండేది.

* * *

క్షణాలమీద కపాచీ విగ్రహం యెదుట బలికి అన్ని రకాల యేర్పాట్లూ జరిగిపోయాయి.

సూర్యుడు ఆకాశం నడినెత్తికి వచ్చాడు.

ఎండ కాలుస్తోంది — సూర్యుడు కూడా టకారాల

కర్కశత్వానికి మండిపడుతున్నట్టుగా వేడి కిరణాలను వదులుతున్నట్టున్నాడు.

చెట్లు గాలికి వికృతంగా పూనకం వచ్చినట్టుగా తలలు వూపుతున్నాయి.

వేడిగాలి ఉధృతంగా వీస్తోంది.

ఇక మిగిలిన మనుషులు ఆ చెట్టుకిందనే జరుగుతున్న తతంగాన్ని చూస్తూ జీవచ్ఛవాల్లా నిలబడ్డారు. వాళ్ళం దరికీ మనసులో గిల్టీగా వుంది.

గుండెల్లో పెట్రోలుపోసి తగల బెడుతున్నట్టుగా కూడా వుంది. ఇంతమంది వున్నారు. ఇద్దరు స్త్రీలను ఆ బలి కార్యక్రమం నించి తప్పించలేక పోయారు. వాళ్ళిద్దరి బదులుగా మరో యిద్దరు మగవాళ్ళు వెళ్ళలేక పోయినందుకు ఎవరికివారికే బాధగా వుంది.

కాని_ తెలిసి తెలిసి కావాలని కోరి ఎవరు మృత్యువు యెదురుగా వెళ్ళి నిల్చుంటారు?

అందరిలోనూ ఇదే ఆలోచన___

ఆ ఇద్దరూ యేడుస్తూనే వున్నారు. ఐనా వాళ్ళ కన్నీటికి విలువలేదు.

బలి పశువుల్లా గింజుకుంటున్నారు వాళ్ళు....

సెలాలో ఆవేశం పొంగింది. ఐనా బలవంతంగా అణచుకుంది.

స్త్రీలను ఇద్దరినీ అలంకరిస్తున్నారు.

నూరిన కత్తులు సిద్ధంగా వున్నాయి.

తనముందు ఇంత సందడిగా వున్నా కపాలీ దేవత మొహం అలాగే వుంది. ఆ దేవత మెళ్ళో వున్న హారం లోని మణి దివ్యమైన కాంతులను విరజిమ్ముతోంది.

భారత్ ఆ మణిని చూస్తున్నాడు. ఆ మణి ఎర్రని

కాంతుల్లాగే అతడి కళ్ళలోనూ క్రోధాగ్ని జ్వాలలు రేగుతున్నాయి.

తమని నిస్సహాయులను చేసి ఈ దీవి టకారాజాతి వాళ్ళు ఘోరమైన అన్యాయాన్ని తమకు చేశారు. తమలో ఇద్దరి మనుషుల చావును తమకు వినోదంగా మార్చుకున్నారు.

నిజంగా ఇదంతా ఆచారంగా—మూఢనమ్మకంగా జరిగే ప్రాయశ్చిత్తమే ఐతే ఆ జంతువులను వదిలినప్పుడు వాళ్ళంతా సంతోషంతో—ఆనందంతో అలా కేరింతలు కొట్టటం ఎందుకు?

నో.... కాదు.... కాదు ముమ్మాటికీ కాదు. ఇదంతా నరబలిని ఇవ్వటానికి అందుకోసం ఏర్పాటు చేసుకున్న వినోదంతో సంతోషం పొందటానికే ఈ ప్రేతాత్మ—పశ్చాత్తాప కార్యక్రమం.

టకారాలు .... తమందరి గుండెల్లో ఆరని చిచ్చు రగిల్చారు. ఇందుకు ప్రతీకారం తీర్చుకోవాలి. మూఢ నమ్మకాలతోనే బతికే ఈ జాతి మనుషులకు ఆ కపాచీ మెళ్ళో కాంతులను వెదజల్లుతున్న ఆ మణి అత్యంత ముఖ్యమైనది—ప్రాణప్రదమైనదీ కావచ్చు.

ఆ మణిని వాళ్ళకు దక్కకుండా చెయ్యాలి. వాళ్ళు ఆ దిగులుతోనే కృశించిపోయేలా చెయ్యాలి.

ఉలిక్కిపడ్డాడు భారత్.

ఎందుకంటే ఆండ్రూస్ అతని దగ్గరగా వచ్చి భుజం మీద చెయ్యి వేశాడు.

"క్షమించు....నీ మనసులో రగులుతున్న కార్చిచ్చు నాకు తెలుసు. ఈ టకారా జాతివాళ్ళు మీరు చెయ్యని నేరానికి కేవలం ఆచారం—నమ్మకం పేరుతో ఎంతటి

ద్రోహాన్ని చేశారో నాక్కూడా తెలుసు. ఐతే ఇలాంటి ద్రోహమే నాకూ జరిగింది. ఐనా నేను భరించాను. భరించక తప్పలేదు."

ఆ మాటలతో ఆశ్చర్యపోయాడు భారత్.

"ఏమిటి మీర నేది ఆండ్రూస్....ఇలాంటి ద్రోహమే మీక్కూడా జరిగిందా? ఎప్పుడు? వివరంగా చెప్పండి."

ఆండ్రూస్ ఏదో చెప్పబోతున్నప్పుడు అక్కడకు నాయకుడు వచ్చి ఆయనతో యేదో చెప్పాడు.

"మీరు యిక్కడే వుండి ఈ ప్రాయశ్చిత్త కార్యక్రమాన్ని చూడలేరేమో! అందువల్ల మీరు మీకు కేటాయించిన ఇళ్ళలోకి వెళ్ళి విశ్రాంతి తీసుకోండి. త్వరలోనే మీకు ఆహార ఏర్పాట్లు చెయ్యబడతాయి. యేమైనా మీలో ఇద్దరిని యెలాంటి గొడవలూ లేకుండా మీ ప్రాయశ్చిత్తానికి వదిలినందుకు మాకు సంతోషంగా వుంది...."

అలా చెప్పగానే నాయకుడు ఆండ్రూస్‌ను తీసుకుని కపాలీ విగ్రహం దగ్గరకు వెళ్ళాడు.

వంకీ కత్తితో నాయకుడి తలను తెగ నరకాలనే కోరిక కలిగింది భారత్‌కి....

ఏం చెయ్యటానికీ ఈ దీవి టకారాజాతి వాళ్ళది....

ఎదిరించి ప్రాణాలు పోగొట్టుకోవటం అవివేకం....

వాళ్ళ మూఢనమ్మకాలమీదనే తను బలమైన దెబ్బ కొట్టాలి....

మరోసారి ధగధగ మెరుస్తున్న ఆ మణిని చూసి తన వాళ్ళందరితో తమకు కేటాయించిన మైదాన ప్రదేశంలో వున్న ఇళ్ళవైపు నడిచాడు భారత్.

స్టెల్లా కూడా ఆ సమయంలో ఏమీ మాట్లాడటానికి

సాహసించలేకపోయింది. ఆమెకీ సిగ్గుగానే వుంది. చేతులారా తమలో ఇద్దరు స్త్రీలను బలిపశువులుగా ఆ మొరటు వాళ్ళకు అప్పగించారు.

ఎలాగైనా ఇందుకు తగిన ప్రతీకారం తీర్చుకోవాలి.

అంతా ఒకే యింట్లోకి వెళ్ళారు.

ఆకులతో వేసిన ఆ ఇళ్ళలో చల్లగానే వుందికాని వాళ్ళందరి గుండెలూ అవమానంతో, క్రోధంతో, పౌరుషంతో భగభగమని మండుతున్నాయి. వేడి సెగలను చిమ్ముతున్నాయి.

అంతా నిశ్శబ్దం .... భయంకరమైన నిశ్శబ్దం .... తేరుకోలేని దెబ్బ తగిలినప్పుడు అలముకునే నిశ్శబ్దం....

ఒక్కొక్కరి గుండె ఒక్కో కొలిమిలా వుంది. అందరిలోనూ ప్రతీకార జ్వాలలు చెలరేగుతున్నాయి.

టకారాలు తమకు శత్రువులు.

శత్రువులు, ఆతిధ్యం ఇచ్చి వెన్నుపోటు పొడిచిన నమ్మకద్రోహులు.

ఉన్నట్టుండి డప్పుల మోత — దానితోపాటు సందడి కోలాహలం మొదలయ్యింది. అరుపులు — చిత్రమైన అరుపులు.

డప్పుల మోత నిమిష నిమిషానికీ తీవ్రస్థాయి నందుకుంటోంది. కపాలీ దేవత యెదుట ప్రాయశ్చిత్త కార్యక్రమం జోరుగా సాగుతోంది.

ఒకే ఒక్క క్షణం....

డప్పుల మోత హెచ్చుస్థాయికి వెళ్ళిపోయి ఒక్కసారి ఆగిపోయింది. సరిగ్గా అప్పుడే వాళ్ళందరికి విని

పించాయి వరుసగా రెండు ఆర్తనాదాలు .... మృత్యుకేకలు ....

* * *

ఒకవైపు మూఢాచారాలతో తలలు నరుకుతున్నా అతిధి మర్యాదలకు మాత్రం యెలాంటి లోపం జరగనివ్వలేదు ఆటకారాజాతి వాళ్ళు.

నల్లమృగం మాంసాన్ని విస్తళ్లలో పెట్టి పంపించారు. కాని వాళ్ళెవ్వరికీ ఆహారం సహించలేదు. కళ్ళముందు ఆ స్త్రీలు ప్రాణభయంతో విలపిస్తున్న దృశ్యమే కనపడింది.

ఎవరూ ఆ మాంసాన్ని ముట్టుకోలేదు.

భారత్ అన్నాడు. "నిజమే. ఇలాంటి పరిస్థితుల్లో యెంత రుచికరమైన ఆహారాన్నైనా మనం తినలేము. కాని మనం ఒక విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహారాన్ని తీసుకోక తప్పదు. ఈ రోజు జరిగిన ఈ ఘోరమైన సంఘటనతో మనం ఇంకొక్క క్షణంకూడా ఆలస్యం చెయ్యకుండా ఈ రాక్షసుల మధ్యనించి వెళ్ళిపోయే ప్రయత్నాలను చెయ్యాలని అర్థమయింది. లేకపోతే ఏదో ఒక నెపంతో మనల్నికూడా వంకీ కత్తులతో నరికివేయవచ్చు. మనకు ప్రతిక్షణం ప్రమాదమే.

నాకు ఒక సందేహం వుంది. ఆండ్రూస్ కూడా ఈ జాతి మనుషులతో చేరిపోయి నాటకం ఆడుతున్నాడేమోనని. అందుకోసమే ఆతిధ్యం పేరుతో మనల్ని ఇలా రుచికరమైన మాంసంతో మేపి చంపుతారేమో అనిపిస్తోంది. కాబట్టి ఈ పరిస్థితులను ఎదుర్కోవాలంటే శారీరకంగా మనం బలంగా ఉండాలి. అందుకోసం ఇప్పుడు ఈ నల్లమృగం మాంసాన్ని తీసుకోక తప్పదు.

దయ చేసి అంతా తీసుకోండి."

భారత్ మాటలను స్టెల్లా సపోర్టు చేసింది. ఆ జాతి వాళ్ళకు ఆ భాష తెలియదు కాబట్టి అప్పుడప్పుడు ఆ మనుషులు అక్కడకు వస్తున్నా పెద్దగానే మాట్లాడు కున్నారు.

అందరికీ భారత్ మాటల్లో వున్న నిజం అర్థమయ్యింది. అవును. దీవినించి పారిపోవటానికి తగిన బలం వుండాలి. ఆ సమయంలో ఆటవికులు దాడిచేస్తే ఎదుర్కొనేందుకు శక్తి కావాలి. అందుకోసమైనా ఇష్టంలేకపోయినా ఆహారాన్ని తీసుకోక తప్పదు.

అలా అనుకున్న తర్వాత అంతా నల్లమృగం మాంసాన్ని భుజించారు.

గూడెంలో సందడి సద్దుమణిగింది.

సముద్ర తీరానికి వెళ్ళటానికి అంతా లేచి నిల్చు న్నారు. బహుశ నాయకుడుకాని జాతి మనుషుల్లో యెవరైనా తమని ఎక్కడికి వెళుతున్నారని అడగొచ్చు.

వాళ్ళకి ఎలా చెప్పాలి.

తమని అనుమానించి వెంట వస్తారేమో!

ఇలాంటి సందేహంతో సతమతమవుతున్నప్పుడు వంకీ కర్ర సాయంతో చిన్నగా అడుగులు వేస్తూ అంద్రూస్ అక్కడకి వచ్చాడు. ఆయన పక్కనే యెవరూ లేరు.

ఆయన్ని చూసి అంతా బిగుసుకుపోయినట్టు కూర్చు న్నారు.

అంద్రూస్ ఒక్కసారి అందరి మొహాల్లోకి అదోలా చూశాడు. ఆయనకు అర్థమయ్యింది వాళ్ళంతా తనమీద బాగా కోపంతో ఉన్నారని....

తెల్లగా నెరిసిన గడ్డాన్ని దువ్వుకుంటూ అందరినీ

చూస్తూ "నాకు తెలుసు. మీ దృష్టిలో సాటి నాగరికుడినై ఉండి కూడా ఆ ఇద్దరు నాగరిక స్త్రీలను రక్షించలేకపోయానని మీ అందరికీ నామీద కసిగా ఉంటుందని నాకు తెలుసు. కాని నిజం మీకు తెలీదు. భారత్ ... ఇంతకుముందు నీతో చెప్పానుకదా! నాకూ ఇలాంటి అన్యాయమే జరిగిందని ....అందులో అసత్యం ఏదీ లేదు. నామీద మీకు కలిగిన అపోహను తొలగించుకోవటంకోసమైనా ఇప్పుడు మీకు నా చరిత్రను చెప్పక తప్పదు" అంటూ ఆగిపోయి మళ్ళీ అందరినీ చూశాడు.

అంతా ఆండ్రూస్ నే చూస్తున్నారు. ఆయనక్కూడా ఏదో ఒక కథ వుందని అంతా అనుకున్నారుకాని అది ఇలాంటి కథ అయివుంటుందని వాళ్ళు అనుకోలేదు.

తిరిగి మొదలుపెట్టాడు ఆండ్రూస్ —

"బ్రిటిషిన్ నౌకలో ఉద్యోగిని ఒకప్పుడు .... నా జీవితం సంతోషంగా గడిచిపోతూ ఉండేది. భార్య ఇద్దరు పిల్లలు. సుఖమైన సంసారం. ఒకసారి ఓడలో సముద్రంమీద ప్రయాణంలో ఉన్నప్పుడు పెను తుఫాను వచ్చింది. ఆ తుఫాను నా జీవితాన్ని యిలా చీకటిగా మార్చి ఈ దీవిలో ఓ అనాగరికుడిగా బతికేలా చేస్తుందని ఆ క్షణంలో ఊహించలేకపోయాను.

తుఫాను తాకిడికి ఓడ తట్టుకోలేకపోయింది. బలమైన సముద్రపు అలలు ఓడను ముక్కలు చేశాయి. అంతా సముద్రంపాలు అయిపోయాం. స్పృహ కోల్పోయిన స్థితిలో ఎవరికి దొరికిన ఆధారంతో వాళ్ళు ఈ టకార దీవికి చేరుకున్నాం.

మొత్తం ముగ్గురం. మిగిలిన యిద్దరూ నాకు మంచి స్నేహితులు. ప్రాణాలతో బయటపడ్డందుకు సంతోష

పడ్డాంకాని ఈ దీవి స్వరూపం చూడగానే దిగులు కలిగింది. ఇక్కడినించి బయటపడటం సాధ్యంకాదేమో అనిపించింది. ఐనా ప్రయత్నం చెయ్యాలని అనుకున్నాము.

చెట్ల మధ్యనించి ఆహారంకోసం నడుస్తున్నప్పుడు వెనకనించి వచ్చిన నీలిరంగు పాము నా స్నేహితుడిని ఒకడిని కాటువేసింది. వాడు నిమిషాలమీద ప్రాణాలు వదిలాడు. ఆ నీలిరంగు పాము కాటుకు ఇక తిరుగులేదని తర్వాత తెలిసింది. మరణించిన స్నేహితుడి శవాన్ని ఆ చెట్లమధ్యనే పాతిపెట్టి వెనక్కి తిరిగిన మమ్మల్ని ఈ టకారాజాతి మనుషులు చుట్టుముట్టారు. వాళ్ళ భాషలో ఏదో అన్నారు. మాకు అర్థంకాలేదు. మమ్మల్ని తీసుకు వెళ్ళి కేవలం సైగలతో నే అసలు విషయాన్ని చెప్పారు.

అదే మరణించిన మనిషిని ఆ దీవిలో పాతిపెట్ట కూడదు. అందుకు ప్రాయశ్చిత్తం చెయ్యాలి. ఇద్దరికంటే ఎక్కువమంది మనుషులంటే ఇద్దర్ని—ఇద్దరే వున్నప్పుడు వారిలో ఒకర్ని తల నరుకుతారుట. ఎవర్ని చంపాలో నిర్ణయించుకోమన్నారు. ఆ విషయం తెలియగానే నా స్నేహితుడు ఏడ్చాడు. చివరికి వాళ్ళే ఈ మెడపొడుగు జంతువును మా దగ్గరకు వదిలారు.

ఆ రోజున కూడా ఇలాంటి కోలాహలమే. ఆ జంతువు నా స్నేహితుడి దగ్గరకు వచ్చి నిల్చుండిపోయింది. వాడిని పట్టుకొని వద్దని యెంత ప్రాధేయపడినా వినకుండా ఎంతో కర్కశంగా, నిర్దయగా వాడి తల నరికి ప్రాయశ్చిత్తాన్ని చేశారు. నేనెంతగానో విలపించాను. చివరికి ఒంటరివాడినై పోయాను.

ఈ దీవినించి ఈ మొరటు మనుషుల మధ్యనించి దూరంగా పారిపోవాలని నేను చేసిన ప్రయత్నాలన్నీ

వృధా ఐనాయి. ఈ టకారాలు నన్ను వదల్లేను. అనుక్షణం వెన్నంటి తిరిగారు. విధిలేక నేను ఈ దీవిలో జీవచ్ఛవంలా బతకటం నేర్చుకున్నాను. నా భార్య—పిల్లలు యెలా వున్నారో—ఏమైపోయారో తెలీదు. వాళ్ళందరూ గుర్తుకు వచ్చి రోజూ రాత్రిళ్ళు ఏడుస్తూ వుండేవాడిని. ఎన్ని రాత్రులూ యేడ్చినా ప్రయోజనం ఏమిటి? చివరకు గుండె రాయి చేసుకుని ఇలా జీవితాన్ని వెళ్ళదీస్తున్నాను.

ఇప్పుడు చెప్పండి. ఇలాంటి చరిత్ర వున్న నేను మీకు సహాయపడకుండా వుండాలని అనుకుంటానా? కాని ఈ నాయకుడి గురించి మీకు తేలీదు. వీళ్ళెంత క్రూరమైన మనుషులో నాకు తెలుసు. అన్నీ తెలిసినవాడిని కాబట్టే నేనలాంటి సాహసాన్ని చెయ్యలేకపోయాను."

తన కథను ముగించాడు.

ఆండ్రూస్ కథ వినగానే అందరికీ ఆశ్చర్యం కలిగింది. ఆండ్రూస్ ఇన్ని కష్టాలను ఎదుర్కొని ఈ దీవిలో ఏకాకిగా బతుకుతున్నాడా?

ఆ మౌనాన్ని ఛేదిస్తూ "డియర్ ఫ్రెండ్స్.... కాబట్టి ఇప్పటికైనా నన్ను అర్థం చేసుకోండి. ఈ టకారాజాతి వాళ్ళమీద నాక్కూడా పగ వుంది. నేను యెన్నో యేళ్ళుగా అవకాశంకోసమే ఎదురుచూస్తున్నాను. కాని ఇన్ని రోజులకు నాకు ఆ అవకాశం మీ అందరి రూపంలో వచ్చింది. మీలో ఇద్దరు స్త్రీలను యెంతగా చెప్పినా వినకుండా ప్రాయశ్చిత్తం పేరుతో బలి ఇచ్చిన తర్వాత నా నిర్ణయం మరింత బలపడింది. ఈ టకారాలను దెబ్బ తీయాలి.

ఐతే శారీరకంగా వీళ్ళతో తలపడి వాళ్ళని మనం

జయించగలటమనేది అసాధ్యమైన పని. బల్లేలు విసరటంలో ఈ జాతివాళ్ళు బాగా నేర్పరులు. బలంలో మనకంటే యెన్నో రెట్లు యెక్కువ. కాబట్టి మనం వాళ్ళతో పోరాడి జయించలేము. ఇక మనం ఈ జాతి వాళ్ళను దెబ్బ తీయటానికి ఒక్కటే మార్గం మిగిలివుంది. మూఢనమ్మకాలమధ్య బతుకుతున్న వాళ్ళను ఆ నమ్మకం మీద నే మనం చావు దెబ్బకొట్టాలి."

అంతవరకూ ఆవేశంగా చెప్పి ఆగిపోయి అందరి మొహాలనూ చూశాడు అండ్రూస్.

"అందుకు మేమంతా ఏం చెయ్యాలి?" ఆత్రంగా అడిగారు అంతా....

వాళ్ళ ఉత్సాహాన్ని, ఆరాటాన్ని చూసి "కపాలీ దేవత హారంలో వున్న ఆ మణిని కాజెయ్యాలి" అని చెప్పాడు.

ఆ మాటతో మిగిలిన అందరితోపాటు భారత్ — సెల్లాలు కూడా ఆశ్చర్యపోయారు. ఎందుకంటే అండ్రూస్ అలాంటి ఆలోచనను చెబుతాడని ఏమాత్రం వూహించనే లేదు.

ఈ ఆలోచన భారత్ కు ఆ పరిస్థితుల్లో కూడా సంతోషాన్ని కలిగించింది.

"తప్పదు. మీరంతా కలిసి ఆ మణిని కాజెయ్యాలి. ఎందుకంటే ఆ మణి టకారజాతివాళ్ళ ఆరో ప్రాణం. ఎన్నో తరాలనించీ ఆ మణి కపాలీ దేవత హారంలో ప్రకాశిస్తూ వస్తూందట. ఆ మణి ఆ దేవత మెడలో లేని రోజు నించీ ఆ జాతిని అకాల మృత్యువు వెంట తరిమి టకారా జాతి అంతా పూర్తిగా అంతరించిపోతుందని ఈ టకారాల ప్రగాఢమైన విశ్వాసం. అందుకే మనం ఆ విశ్వాసం

మీద దెబ్బతీసి వాళ్ళు ప్రాణ భయంతో విలవిల్లాడి పోయేలా చెయ్యాలి.... ఏమంటారు?"

భారత్ అన్నాడు "మీరు చెప్పినదంతా మాకు నచ్చింది. శారీరకంగా ఇప్పుడు వున్న పరిస్థితుల్లో ఎదుర్కొని విజయం సాధించటం సాధ్యంకాదని మాకూ తెలుసు. అందువల్ల మీరు చెప్పినట్టుగా ఆ మణిని కాజేసి టాకారాలకు మృత్యుభయం కలిగిస్తాం. కాని ఇందుకు కొన్ని ఇబ్బందులు వున్నాయి కదా.... మీరు వాటి గురించి చెప్పలేదు."

"ఏమిటా ఇబ్బందులు?" ఆంద్రూస్ అడిగాడు.

"ఆ మణిని కాజెయ్యటం ఎలా సాధ్యమవుతుంది? పగటివేళ సూర్యకాంతిలో, రాత్రి వేళ కాగడాల వెలుగులో ఆ మణి ఎర్రని కాంతులను వెదజల్లుతూ వుంటుంది కదా!"

నవ్వాడు ఆంద్రూస్.

"ఇందుకు తగిన సమయం ఎప్పుడో నేనే చెబుతాను. ఈ టకారా దీవిలో ఒక ఆచారం వుంది. అమావాస్య రోజు రాత్రి దీవిలో యెక్కడా యెటువంటి పరిస్థితుల లోనూ ఒక్క కాగడా కూడా వెలగదు. అమావాస్య రాత్రి కపాలీ దేవత దీవిలో సంచరిస్తుందని వీళ్ళ నమ్మకం. అందుకే ఆ రాత్రి యెక్కడా వెలుగు వుండ కూడదట. ఆ రోజు సూర్యాస్తమయానికే రాత్రి ఆహా రాన్ని కూడా వండుకుని సిద్ధం చేసుకుంటారు. అమావాస్య రాత్రి దీవి మొత్తం చీకట్లో మునిగిపోయి వుంటుంది. ఆ చీకట్లోనే మీరు ఆ మణిని దొంగిలించాలి."

ఆ విషయం విన్న తర్వాత భారత్ కు అంతులేని సంతోషం కలిగింది. ఆ మణిని యెలాగైనా కాజెయ్యా

లనే ఆలోచన తనకు యెప్పుడో కలిగినా యెలా కాజెయ్యాలో తెలీక ఉండిపోయాను. ఇప్పుడు ఆంద్రూస్ అందుకు తగిన పథకాన్ని చెప్పాడు.

"బావుంది ఆంద్రూస్....మణిని కాజెయ్యటం వరకు బాగానే వుంది. కాజేసిన తర్వాత మేము ముందు ఈ దీవినించి బయటపడటం ఎలా?" స్టెల్లా అడిగింది.

"ఈ ప్రశ్నను మీరు కావాలని అడుగుతున్నారు. నిన్న ఉదయం దీవి లోపలకు వెళ్లారు. మీరు సముద్ర తీరాన్ని చూడకుండానే వెనక్కి వచ్చి వుంటారా? సముద్రాన్ని తీరంలోనే ఉన్న ఆ చెట్లను చూసినప్పుడు వాటిని నరికి తెప్పలు తయారు చేసుకోవాలనే ఆలోచన మీకు నిజంగానే రాలేదా మిస్టర్ భారత్" అని అడిగాడు.

షాక్.. షాక్....

ఒక్కసారిగా అంతా అదిరిపడి ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

ఈ విషయం ఆంద్రూస్ కు ఎలా తెలిసింది?

ఎవరు చెప్పారు?

ఊహు....ఎవరూ చెప్పే అవకాశమే లేదు. తెప్పలను తయారుచేస్తున్నప్పుడు రహస్యంగా చూసిన టకారాజాతి మనిషిని అప్పుడే పులి చంపి తీసుకుపోయింది.

మరి అలాంటప్పుడు ఆంద్రూస్ అంతా పూర్తిగా తెలిసినవాడిలా యెలా మాట్లాడుతున్నాడు?

ఆంద్రూస్ దగ్గర ఏవైనా దివ్యశక్తులున్నాయా?

తిరిగి నవ్వాడు ఆంద్రూస్ — "అంతా మవునం వహించారేమిటి? మాట్లాడండి. నిజంగా మీకు ఈ దీవి నించి సముద్రంమీదగా యెలా ప్రయాణం చెయ్యాలో

తెలిసింది కదూ?"

ఇక ఈ దాగుడుమూతలు అనవసరం అనిపించింది భారత్ కి. అందుకే—

"మిష్టర్ ఆంద్రూస్....మీరు ఊహించింది నిజమే... ఇప్పటివరకూ మీరు కూడా ఈ టకారాజాతి మనుషుల పక్షమే అన్న అభిప్రాయంతోనే మీకు ఈ విషయాన్ని చెప్పకుండా దాచివుంచాము. నిన్న మేము అందరం సముద్ర తీరానికి వెళ్ళాం. అప్పుడే చెట్లు నరికి తెప్పలు తయారుచేసుకుని వాటితో సముద్రంమీద ప్రయాణం చెయ్యాలనే ఆలోచన వచ్చింది. అందుకే చెట్లు నరికి తీగలు తెంచి వాటితో కొన్ని తెప్పలను తయారుచేశాం. కాని మేము వాటిని తయారు చెయ్యటం ఈ జాతి మనిషి ఒకడు చూసి వెనక్కి తిరిగాడు గూడేనికి రావటానికి. కాని సరిగ్గా అప్పుడే ఓ పులి అతడిమీద దాడిచేసి అతడిని గాయపరిచి చంపి నోట కరుచుకుని పారిపోయింది."

ఆంద్రూస్ కళ్ళు పెద్దవిచేసి "ఐతే ఆ టకారా పులి వాత పడ్డాడా?" అనడిగాడు.

"అవును."

"అతడిని పులినించి కాపాడే ప్రయత్నాలు మీరు చెయ్యలేదు కదూ?" అడిగాడు ఆంద్రూస్.

మరోసారి ఉలిక్కిపడ్డారు వాళ్ళు.

ఆంద్రూస్ గొప్ప జీనియస్ అనిపించాడు.

"నిజమే. అతడిని కాపాడే ప్రయత్నంకూడా మేము చెయ్యలేదు. ఎందుకో మీరు ఊహించగలరనుకుంటాను. అతను మా గురించిన ఓ రహస్యాన్ని తెలుసుకున్నాడు. అతడు బతికివుంటే ఆ రహస్యం అందరికీ తెలిసిపో

తుంది."

అల వూహాడు ఆంద్రూస్.

తర్వాత "ఇప్పుడు మీ సందేహాలన్నీ క్లియర్ అయినా యనుకుంటాను. ఆ మణిని కాజెయ్యటంతో టకారాలను దెబ్బతియ్యటమే కాకుండా ప్రపంచ మార్కెట్లో ఎన్నో కోట్లు విలువచేసే ఆ మణి మీ సొంతమవుతుంది. మీరు సురక్షితంగా బయటపడి వెళ్ళగలిగితే ఆ మణిని అమ్మటం ద్వారా ఎంతో ధనాన్ని మీరు సంపాదించుకోగలరు. ఇక మీరు ఈ దీవినించి పారిపోవటానికి అవసరమైన తెప్పలను తయారు చేసుకోండి. అమావాస్య రోజు రాత్రి ఆ మణితో ఈ దీవిని వదిలి వెళ్ళిపోవటానికి సిద్ధంగా ఉండండి" అన్నాడు.

"మేము బల్లేలతో. వంకీ కత్తులతో దీవి లోపలకు వెళుతుంటే ఈ టకారాలకు అనుమానం రాకుండా వుంటుందా? వాళ్ళు మమ్మల్ని వెంటాడకుండా వూరు కుంటారా?" స్టెల్లా అడిగింది.

"అనుమానం రాకుండా మిమ్మల్ని వెంటాడకుండా ఉండేట్టు నేను చూస్తాను. ఎలాగంటే ఇక మీరంతా ఈ దీవినించి బయటకు వెళ్ళే మార్గంలేదని గ్రహించి ఏడు రోజుల తర్వాత మీ ఆహారాన్ని మీరే వేటాడి సంపాదించుకోవాలి కాబట్టి ఇప్పటినించే నల్లమృగాల వేటకు బయల్దేరుతున్నారని, వేటను అలవాటు చేసుకుంటు న్నారని నాయకుడితో మిగిలిన టకారాలతో చెబుతాను. అప్పుడు వాళ్ళు మిమ్మల్ని అనుమానించరు. పైగా సంతో షిస్తారు. ఎందుకంటే నాగరికులను కూడా అనాగరికులుగా మార్చి ఈ దీవిలో బందీలుగా చెయ్యటం అంటే వీళ్ళందరికీ ఎంతో ఇష్టం. అందుకు ప్రత్యక్ష నిదర్శనం-

నే నే."

ఆయన కళ్ళల్లో నీళ్లు తిరగటాన్ని వాళ్ళు చూశారు. ఆంద్రూస్ బాధపడుతున్నాడని గ్రహించారు.

"క్షమించండి ఆంద్రూస్. మిమ్మల్ని మేమంతా అపార్థం చేసుకున్నాం. కాని మీరు కూడా ఈ టకా రాలవల్ల ఎంతో జీవితాన్ని నష్టపోయారని తెలిసినప్పుడు నిజంగా మా గుండె ద్రవించింది. దురదృష్టవశాత్తు తమ దీవిని చేరిన నాగరిక మనుష్యులను ఈ టకారాలు ఎంత హింసకు గురిచేస్తున్నారో అర్థమయ్యింది. తప్పకుండా ఈ టకారాలమీద పగతీర్చుకోవలసిందే. అందుకు మీరు చెప్పిన పథకం ప్రకారమే ఆ మణిని మా హస్తగతం చేసుకుంటాం. కాని వాదో రిక్వెస్టు .... మీరు కూడా మాతోపాటుగా ఈ దీవిని వదిలి వచ్చెయ్యండి" భాగత్ అన్నాడు.

బలహీనంగా నవ్వాడు ఆంద్రూస్.

నవ్వి "వద్దు....ఇక నాకు జీవితంమీద విరక్తి కలిగింది. ఇన్నేళ్ళు జీవచ్ఛవంలా ఇక్కడ బతికాను. ఇప్పుడు అదృష్టవశాత్తూ సురక్షితంగా నాగరిక ప్రపంచంలో అడుగుపెట్టగలిగినా నాగరికుడుగా బతకలేనేమోననే అనుమానం కూడా నాలో వుంది. ఈ పారిపోవటంలో యెదురయ్యే ఒడుదుడుకులను కష్టనష్టాలను కూడా ఎదుర్కొగల శక్తి నాలో లేదు. అందుకే మీరు వెళ్ళండి. నన్ని బందిఖానానించి బయటకు రమ్మని కోరినందుకు థాంక్స్....

ఇప్పటికే చాలా పగలు గడిచింది. ఇక మీరు బయలుదేరండి. తెప్పలు తయారుచేసుకుని పొద్దు వాలిపోయే సమయానికి తిరిగి రండి. టకారాలకు 'నమ్మకం కలిగించ

టానికి ఏమైనా రెండు జంతువులను వేటాడి తీసుకు రండి. చివరికి ఓ కుందేలునైనా సరే. నేను ఎక్కువసేపు మీతో మాట్లాడటం నాకు మీ అందరికీ కూడా క్షేమం కాదు. వెళ్లొస్తాను. వెంటనే బయల్దేరండి" అని అక్కడినించి వెళ్ళిపోయాడు.

ఆండ్రూస్ వెళ్ళటంతోనే ఒక్కసారిగా అంతా భారంగా నిట్టూర్చాడు.

• • •

చీకటి—మామూలు చీకటికాదు. కన్ను పొడుచుకున్నా కనుపించని చీకటి—

గాంఢాంధకారం.

టకారాదీవి సంతటినీ నల్లటి తెరలు ఏవో కప్పివేసినట్టుగా వుంది.

గాలి రివ్వున వీస్తోంది.

అమావాస్య చీకటి.

ఆ రాత్రికోసమే భారత్ బృందం ఈ నాలుగు రోజులనించీ ఎదురుచూస్తోంది. ఎదురుచూస్తున్న రాత్రి రానే వచ్చింది. అంతా ఇళ్ళ బయట కూర్చున్నారు.

చీకట్లో వాళ్ళు దయ్యాల్లా వున్నారు.

ముఖ్యమైన వస్తువులను ఎవరి దుస్తుల్లో వాళ్ళు దాచుకున్నారు. చిన్నగా మాట్లాడుకుంటున్నారు.

భారత్-సెల్లాలు వాళ్ళందరినీ ఉత్తేజపరుస్తున్నారు. టకారాజాతి వాళ్ళు తమకు చేసిన ద్రోహానికి తగిన ప్రతీకారం తీర్చుకోక తప్పదనే విషయాన్ని పదేపదే హెచ్చరిస్తున్నారు.

సూర్యాస్తమయం జరుగుతున్నప్పుడే టకారాజాతి మనుషులు వాళ్ళందరికీ ఆహారాన్ని తీసుకొచ్చి పెట్టారు.

తింటున్నప్పుడు నాయకుడు — ఆంద్రూస్‌తో అక్కడకు వచ్చాడు.

కిచకిచలతో ఆంద్రూస్‌తో యేదో చెప్పాడు.

ఆంద్రూస్ వాళ్ళందరినీ కలియజూస్తూ "ఈ దీవి ఆచారం ప్రకారం ఈ రాత్రి ఈ దీవిలో యెక్కడా కాగడాలు వెలిగించడం జరగదు. ఆ విధంగా కాగడాలను వెలిగించటం గొప్ప అపచార మవుతుంది. ఈ రాత్రి కపాచీ దేవత దీవిలో సంచరిస్తుంది. వెలుగు చేసి ఆమెకు ఆగ్రహం కలిగిస్తే వాళ్లు నాశమైపోతారు. ఇది నాయకుడి ఆజ్ఞ" అంటూ ముగించాడు.

అప్పటికి సూర్యుడు పూర్తిగా దిగిపోయాడు.

చీకటి నీడలు నెమ్మదిగా పరుచుకుంటున్నాయి.

నాయకుడు మళ్ళీ ఏదో చెప్పిన వెంటనే ఆంద్రూస్ మొహంలో ఎటువంటి భావాలనూ కనపడనీయకుండా అందరినీ ఉద్దేశించి "అనుకున్న పథకం ప్రకారం మణితో ఈ దీవి వదిలి వెళ్ళటానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా వున్నారుకదా! జాగ్రత్త, టకారజాతిమీద పగ తీర్చుకోండి....ఇంతకీ నాయకుడు మిమ్మల్ని జాగ్రత్తగా యిళ్ళలో పడుకొని నిద్రపొమ్మని చెబుతున్నాడు. ఇక వెళతాం....నాయకుడికి అనుమానం వస్తుంది. విష్ యు ఆల్ సక్సెస్ మైడియర్ ఫ్రెండ్స్" అని నాయకుడితో అక్కడినించి వంకీ కర్ర సాయంతో గడ్డం సవరించుకుంటూ వెళ్ళిపోయాడు.

వాళ్ళిద్దరూ వెళ్ళగానే సెల్లా అన్నది—

"ఆంద్రూస్ మనస్తత్వం చాలా చిత్రంగా వుంది. టకారాలమీద ఇంతటి కసి, ప్రతీకారం వున్న మనిషి— మనతో చేతులు కలిపినట్టుగానే ఈ దీవి వదిలి మనతో

వచ్చే ప్రయత్నం చెయ్యవచ్చుకదా! జీవితంమీద విరక్తి కలిగిందంటూ ఈ దీవిలోనే జీవచ్ఛవంలా బతకటం యెందుకు?" అన్నది.

"ఎందుకో మనకు తెలీదు. బహుశ ఆండ్రూస్ ఈ విధమైన అనాగరిక జీవితానికి అలవాటుపడిన మాట నిజమే ఐవుండొచ్చు. ఇన్నేళ్లుగా యిలాంటి జీవితాన్ని అనుభవిస్తూ వచ్చిన తర్వాత సహజంగా ఎప్పుడో మరచిపోయిన నాగరిక జీవితాన్ని తిరిగి ప్రారంభించాలంటే భయంగానే ఉండొచ్చు. ఏమైనా ఆ అనుభవం, ఆ భయం అనేది అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది. మనం ఊహించటానికి వీలులేనిది."

భారత్ మాటల్లో సెల్లాకు సరయిన రీజనింగే కనపడింది.

ముసలాయన వున్నట్టుండి అన్నాడు "నాకేమిటో భయంగా వుంది. ఈ కటిక చీకట్లో మనందరం ఒకరికొకరం తెలిసిన మనుషులమే ఐనా ఒకర్నొకరు చూసుకుంటుంటే ఏదో తెలియని భయం కలుగుతోంది. అలాంటప్పుడు ఈ రాత్రిలో చీకటి యింకా చిక్కబడిన తర్వాత క్రూరమృగాలు, ముళ్ళ పొదలు, కత్తుల చెట్ల మధ్యనించి సముద్ర తీరానికి పారిపోవాలనుకుంటే నాకు సాధ్యంకాదేమో అనిపిస్తోంది."

వెంటనే సెల్లా అన్నది.

"ఇలా భయపడినందువల్ల కొంచెంకూడా ప్రయోజనం లేదు. భయపడి చెయ్యగలిగిందికూడా ఏమీలేదు. ఎందుకంటే, భయపడి మనం ఈ దీవిలోనే శాశ్వతంగా వుండిపోవాలని అనుకోవటం లేదుకదా? ఈ దీవిలోకూడా మనకు రక్షణలేదు. రక్షణ వుంటుందనుకున్నా ఇక్కడ

మనం వుండలేము. చివరకు మనం ప్రాణాలకు తెగించే ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇప్పుడు మనం భయపడటం అవివేకమే అవుతుంది."

ఒల్డు మేన్‌కి సెల్లా మాటలకు కోపం వచ్చింది.

"అవివేకం....ఇలా అనటం చాలా ఈజీగానే వుంటుంది. మీరంతా యువకులు. ఎంతటి సాహసానికైనా వెనుదీయక పోవచ్చు. కాని నేను ఓల్డు ఫెలోని. అందుకే ప్రాణభయంతో ప్లేన్‌లో ఆ దొంగలకు నా దగ్గర ఉన్నవన్నీ వాళ్ళు అడక్కముందే తీసి యివ్వబోయాను. కాని మీరు చేసిందేమిటి? తర్వాత యెదురవబోయే ప్రమాదం గురించి ఆలోచించకుండా వాళ్ళమీద కాల్పులు జరిపారు. దాని ఫలితం ఏమిటి? ఇప్పుడు మనమంతా యిలా ఈ దీవిలో చిక్కుకుపోయి ప్రాణ భయంతో తన్నుకుంటున్నాం. ఇందుక్కారణం ఎవరు? మీరే.... మీ యిద్దరివల్లనే యిలా జరిగింది?"

సెల్లా—భారత్ ఒకరినొకరు చూసుకున్నారు.

దీవినించి పారిపోదామని అనుకుంటున్న చివరి క్షణాల్లో ఓల్డు మేన్ యిలా మాట్లాడటం వాళ్ళకు బాగా యిబ్బంది నే కలిగించింది. ఇంతకుముందు అక్కడ ఉన్న మిగిలిన మనుషుల్లో కూడా ఈ కష్టాలన్నింటికీ కారకులు వాళ్ళిద్దరే అనే ఆలోచన వున్నా వాళ్ళెవరూ బయట పడలేదు. ఎందుకో కాదు, అలా బయటపడినందువల్ల ఏమీ ప్రయోజనంలేదు. జరిగిందేదో జరిగింది. అంతే....

భారత్ అన్నాడు యెంతో శాంత స్వరంతో—

"డియర్ సర్....యిలాంటి ప్రమాదం జరగాలని మనందరం ప్రాణభయంతో తన్నుకు చావాలని మేము ఆ దొంగలమీద కాల్పులు జరపలేదు. మన సంపదను

వాళ్ళు దోచుకుంటున్నారని వాళ్ళని ప్రతిఘటించాం. కాని దురదృష్టవశాత్తూ యిలా జరిగింది. జరిగిందానికి కారకులు యెవరు? వాళ్ళని నిందించాలి అనుకోవటంవల్ల ఇప్పుడు మనకు వచ్చేదేమిటి? దయచేసి మీ మనసులో ఆలోచనను తరిమెయ్యండి..మనం తీసుకున్న నిర్ణయంలో మార్పు ఉండకూడదు. చావైనా బతుకైనా మనందరం కలిసే అనుభవిద్దాం .. ప్లీజ్ కోఆపరేట్ విత జ్ ...”

“నా ఉద్దేశం అదికాదు మిస్టర్ భారత్ .... ఈ టకారాలమీద పగతీర్చుకునే విషయాన్ని మనం దూరంగా ఉంచితే ఇక మనకు ముఖ్యమైనది ఈ దీవినించి తెప్పల సాయంతో సముద్రంమీదికి వెళ్ళిపోవటమే కదా! అందుకు మనం ఈ రాత్రివేళనే వెళ్ళవలసిన అగత్యంలేదు. తెల్లవారిన తర్వాత నల్లమృగాల వేటకని బల్లేలతో, వంకీ కత్తులతో బయల్దేరి వెళ్ళి అక్కడనించి తెప్పలమీద పారిపోవచ్చు కదా?”

“నిజమే సర్. అలా చెయ్యొచ్చు. కాని టకారాలను చావుదెబ్బ కొట్టటంకూడా మన లక్ష్యాలలో ఒకటి. ఎందుకంటే వీళ్ళు మానసికంగా మనల్ని ఎంత దారుణంగా హింసించారో మనం ఇంకా మరచిపోలేదు. మన నాగరికుడైన ఆండ్రూస్‌నుకూడా ఈ జాతివాళ్ళు అనాగరికుడిగా, ఓ శిలగా మార్చేశారు. అందువల్ల మనం ఈ టకారాలను దెబ్బతీయాక తప్పదు.

దెబ్బతీయటమంటే వాళ్ళు ప్రాణాధికంగా, ఎంతో అపురూపంగా చూసుకుంటున్న ఆ కోట్లు విలువచేసే అపూర్వ మణిని మనం కాజేసి వెళ్ళటమే. మీరు చెప్పినట్టుగా మనం ఈ దీవి వదిలి బయటపడటమే ముఖ్య

ధ్యేయంగా పెట్టుకున్నప్పటికీ పగటి వేళ అదికూడా అంత సులభమైనదని నాకు అనిపించటంలేదు. ఎందుకంటారా? ఎక్కడనించయినా టకారాలు మనల్ని గమనిస్తూ వుండొచ్చు. తెప్పలను సముద్రంమీదికి చేరవేస్తున్నప్పుడు చూశారంటే మనల్ని ప్రాణాలతో వదలరు. ఈ దీవి ఆచారం ప్రకారం దాన్ని ఒక గొప్ప నేరంగా ప్రకటించి ప్రాయశ్చిత్తంగా మనందరినీ నరికేస్తారు.

ఏ విధంగా చూసినా ప్రమాదం మనల్ని వెన్నంటి వుంటూనే వుంది. అటువంటప్పుడు ఆ సాహసాన్ని ఈ రాత్రికే చెయ్యగలిగితే టకారాలమీద పగ సాధించటంతో పాటు—కోట్లు విలువచేసే ఆ మణికూడా మన సొంతమవుతుంది."

ఆగాడు భారత్.

చీమ కదిలితే వినిపించేటంతటి నిశ్శబ్దం ఆ ప్రదేశాన్నంతటినీ ఆవరించుకుని వుంది.

అతడి మాటలు మిగిలిన వాళ్ళమీద బాగానే పని చేశాయి. అవును, చావుకు తెగించే ఈ సాహసానికి పూనుకుంటున్నారు. అలాంటప్పుడు భయపడటం ఎందుకు?

కొంచెం దూరంలో కనపడుతున్న పొడుగాటి చెట్లు రివ్వున వీస్తున్న గాలికి పిచ్చిగా వూగుతున్నాయి పూనకం వచ్చినట్టు.

అంతకుముందువరకు అప్పుడప్పుడు టకారాల కిచకిచలు వినిపించాయి. రాను రాను ఆ కిచకిచలు ఆగిపోయాయి. అంతా నిద్రాదేవి ఒడిలోకి వెళ్ళిపోతున్నారు.

అంతేకాదు. ఆ రాత్రి చీకట్లో కపాచీ దేవత ఆ దీవినంతటినీ తిరుగుతుందనే నమ్మకంకూడా వుంది కాబట్టి, రోజూకంటే ముందుగానే ఇళ్ళలో చీకట్లోపడి నిద్రపోవ

టానికి ప్రయత్నం చేస్తారు.

టకారాల నమ్మకాల గురించి తల్చుకుంటే సెల్లాకు అంతులేని నవ్వొచ్చింది.

ఇడియట్స్....

అన్నీ ఫూలిష్ సెంటిమెంట్స్....రాత్రి వేళ—యింత చీకట్లో కపాచీ దేవత దీవిలో సంచరిస్తుందా?

ఎందుకు? ఏం చూడటానికి? టకారాలంతా క్షేమంగా వున్నారో, లేదో తెలుసుకోవటానికా!

పోనీ....వాళ్ళ ఆ బ్లయిండ్ నమ్మకమే ఈ రాత్రి ఆ విలువైన మణిని దోచుకొని పోవటానికి తగిన అవకాశాన్ని కల్పిస్తోంది.

తమ గుడ్డినమ్మకం కారణంగా తమకు తీరని నష్టం కలగబోతున్నదని వాళ్ళకు తెలీదు. కనీసం ఊహించ లేరు కూడా.

ఇక ఆండ్రూస్....ఒక విచిత్రమైన మనిషి....జీవితంలో అందరినీ, అన్నిటినీ పోగొట్టుకుని కేవలం మసలి బొమ్మలా వంకీ కర్రతో గూడెంలో నాయకుడి ఆజ్ఞలను శిరసావహిస్తూ తిరిగే ఓ వింత మనిషి....

ఏ వాతావరణానికి అలవాటుపడిన మనిషి ఆ వాతావరణాన్ని వదిలి బయటకు రాలేడు అని తెలుసుకోవటానికి ఓ గొప్ప నిదర్శనం ఆండ్రూస్.

నిమిషాలు దొర్లిపోతున్నాయి.

చలిగాలి వుండుండి ఉధృతంగా వీస్తోంది.

ఆకాశంలో నక్షత్రాల కాంతి మాత్రమే వుంది. ఆ కాంతిలో బాగా కళ్ళు పెద్దవిచేసుకుని నిశితంగా చూస్తే గానీ యేమీ కనపడటంలేదు. ఐతే చాలా సేపటినించీ చీకట్లోనే కూర్చుని చూస్తూ వుండటంతో—చీకట్లో

కూడా చూడటానికి కళ్ళు కొంచెం అలవాటుపడినాయి.

దూరంగా ఎక్కడో దట్టమైన అడవిలోయేమో!— యేవో మృగాల అరుపులు వినపడుతున్నాయి.

ఎక్కడో చెట్లమీద పక్షులు గోలగా అరుస్తున్నాయి.

ఆత్రంగా వుంది అందరికీ. ఇళ్ళ దగ్గర వున్న తమ వాళ్ళందరూ గుర్తుకు వస్తున్నారు. ఒక రకంగా ఇది అంతిమయాత్ర. ఈ సాహస యాత్రలో ఎన్నో గండాలను తప్పించుకుని బయటపడగలిగితే తమ దేశాలను చేరుకుంటారు. లేకపోతే ఈ దీవిలోనే షాంకీల్ లా ఆ ఇద్దరి స్త్రీలలా ప్రాణాలను పోగొట్టుకుంటారు. అంతే. ఎక్కడో పుట్టారు. చివరికి ఇక్కడ ఈ దీవంటూ ఒకటి వుందని యెవరికీ తెలియని దీవిలో కన్నుమూస్తారు.

ఆ దీవిలో జరిగిన సంఘటనలను—ఆండ్రూస్ అనుభవిస్తున్న నికృష్టపు జీవితాన్ని గుర్తుచేసుకుంటే వారిలో ఓ విధమైన తెగింపు కలిగింది.

చేతినున్న వాచీకేసి చూసుకున్నాడు భారత్.... అందులో టైమెంతయ్యిందో తెలీలేదు. ఎందుకంటే అది ఎప్పుడో ఆగిపోయింది. ఎందుకు ఆగిపోయిందో తెలీదు. మిగిలిన మనుషుల దగ్గరవున్న గడియారాలుకూడా ఆగిపోయాయి.

సిగరెట్లు యెప్పుడో ఐపోయాయి. సిగరెట్లు కాల్చక పోవటంవల్ల అదోలా వుంది.

అక్కడ వున్న నిశ్శబ్దాన్ని తెగ్గొడుతున్నట్టుగా భారత్ యిలా అన్నాడు—"ఇక మనం బయలుదేరుదాం. టకారాలంతా గాఢనిద్రలో మునిగి తేలుతూ వుంటారు. యిప్పుడు చాలా సమయం గడిచివుంటుంది. ఒంటిగంట

ఐవుంటుందనుకుంటాను. లేవండి, మీలో వున్న జడత్వాన్ని, భయాన్ని, పిరికితనాన్ని అన్నింటినీ యిక్కడే వదిలెయ్యండి. వాటి స్థానాల్లో సాహసాన్నీ ధైర్యాన్నీ ఒకవిధమైన తెగింపునీ నింపుకోండి.

"మరో విషయం బాగా గుర్తుంచుకోండి. ఎటువంటి పరిస్థితులలోనూ యెవ్వరూ మాట్లాడకండి. చప్పుళ్ళు చేయకండి. అలా చేస్తే టకారాలు మేలుకుంటారు. వాళ్ళే మేలుకోవటం జరిగితే మనం ఈ దీవినించి అంగుళం కూడా కదల్లేము. పైగా ప్రాణాలు పోగొట్టుకుంటాము. చావైనా బతుకైనా అందరికీ ఒక్కటే...."

నల్లమృగాల వేటకు టకారాలు వాళ్ళకిచ్చిన బల్లేలు, కత్తులు వాళ్ళ దగ్గరే వున్నాయి. ఎందుకంటే ఆ రోజుతో నాగరికులకు టకారాలు ఇచ్చే ఆతిథ్యం పూర్తవుతుంది. ఇక తెల్లవారిన తర్వాత వాళ్ళు మృగాలను వేటాడి తెచ్చుకుంటేనే ఆహారం. లేకపోతే ఆకలితో మాడి చావాల్సిందే. అందుకే ఆ వేటకు అవసరమైన ఆయుధాలను వాళ్ళ దగ్గర్నించి తీసుకోలేదు.

అంతా ఆయుధాలు తీసుకున్నారు.

నిలుచున్నారు.

• • •

ముందు భారత్, పక్కనే స్టెల్లా....ఆ వెనుక మిగిలిన వాళ్ళంతా నడుస్తున్నారు.

భారత్ మరోసారి అందరికీ హెచ్చరికలు చేశాడు.

కొంతమంది తమకేని యేలాంటి ఆటంకం లేకుండా సాగిపోవాలని మనసులోనే దేవుణ్ణి ప్రార్థించారు.

ముసలాయన యాంత్రికంగానే నడిచాడు. జరిగేదేదో జరక్క మానదు అనే భావం ఒకటి ఆయన గుండెల్లో

మిగిలిపోయింది.

చిన్నగా నడుస్తున్నారు—చప్పుడవకుండా ....

ఇల్లు దాటి మైదానంలోనించి ముందుకు వెళ్ళారు. జాగ్రత్తగా అటూ యిటూ చూసుకుంటూ నడుస్తున్నాడు భారత్. చిన్న మలుపు తిరిగారు.

ఇక అక్కడనించి టకారాలు వుంటున్న యిళ్ళు మొదలైనాయి. నాయకుడి యింటి ముందుకు వచ్చారు.

నాయకుడి యింటి తలుపు మూసి వుంది. లోపలనించి ఎలాంటి అలికిడీ వినిపించటంలేదు.

కొంచెం మార్గంలో ఎదురుగా చీకట్లో కపాచీ దేవత విగ్రహం మరింత భయంగొలిపేలా వుంది. దాన్ని దూరం నించి చూడగానే అందరికీ భయం కలిగింది.

కపాచీ దేవత నిజంగా వుందా?

నిజంగానే వుంటే టకారాలమీద పగతో తన హారంలో వున్న మణిని కాజేస్తుంటే ఆమె వూరుకుంటుందా?

కపాచీ అంటే కాపాడే దేవత అని ఆంద్రూస్ చెప్పాడు. అంటే టకారాలను కాపాడే దేవత విగ్రహం అది.

ఆ దేవత టకారాలకు అన్యాయం జరగనిస్తుందా?

ఇలాంటి భయం అందరి హృదయాల్లోకీ స్లో పాయిజన్‌లా ప్రవేశించింది.

భయంతో అందరూ దేవతా విగ్రహం ముందు నిలబడ్డారు.

ఎంతో యెత్తుగా వుంది విగ్రహం.

తలెత్తి పైకి చూశాడు భారత్. హారం—అందులో మణి నక్షత్రాల వెలుగులో కనపడుతోంది.

గాలి రివ్వున వీస్తోంది.

భారతీయుడు కావటంవల్లనేమో భారత్‌కు సెంటి మెంట్సు ఎక్కువ. సెల్లాకు ఏమీ అనిపించటంలేదు. అతనికి ఆ విగ్రహం మీదకు ఎక్కటానికి కొంచెం వొళ్లు జలదరించింది.

ఈ దేవతలో నిజంగా శక్తి వుందా?

ఉంటే ఏమవుతుంది?

చాలా చిన్నగా సెల్లా భారత్‌ను మోచేత్తో పొడిచింది, యింకా యేమిటి ఆలస్యం అన్నట్టు.

మణి గురించి తల్చుకోగానే భారత్‌లో తిరిగి తెగింపు వచ్చింది. అంతే—యింకేమీ ఆలోచించలేదు. కళ్ళముందు ఆ మణి దివ్యమైన తేజస్సునే వుంచుకున్నాడు. కోట్లు ఖరీదు చేసే దాన్నే దృష్టిలో వుంచుకున్నాడు.

ఒక్కటే ధ్యేయం.

విగ్రహంముందు రాతిమెట్లు వున్నాయి. అక్కడంతా యేవో చెట్ల ఆకులు-తీగెలు వున్నాయి. జిగటగా కూడా వుంది. పొడుగాటి కత్తులు రెండు మెట్లమీద పడి వున్నాయి.

అతడి రక్తం పొంగింది.

ఆ రెండు కత్తులే తమలో ఆ యిద్దరి స్త్రీల తలలనూ నరికి వుంటాయి.

టకాకాలు! తమకు శత్రువులు.

మెట్లన్నిటినీ ఎక్కాడు. భారత్ కదలికలు అందరికీ అస్పష్టంగా కనపడుతున్నాయి. అంతా భయంగా చూస్తున్నారు. యే క్షణంలో ఏం జరుగుతుందో తెలీదు.

కాళ్ళు వణుకుతున్నాయి.

చలిగాలి కదిలించి వేస్తోంది.

ఒళ్ళు జలదరించే చిత్రమైన ధ్వనిచేస్తూ గాలి వీస్తోన్నది. అంత చలిలోనూ అందరికీ చెమటపోస్తోంది.

రాతిమీద చెక్కిన విగ్రహమే కపాచీ దేవత, పైకి ఎక్కటానికి అనువుగా చెక్కారు. ఎవరు చెక్కారో? ఎన్నో యేళ్ళక్రితం చెక్కిన విగ్రహం అది.

దేవత పాదంమీద కాలు పెడుతున్నప్పుడు భారత్ శరీరం ఎందుకో వణికింది. చీకట్లో చేత్తో తడిమాడు. కాలు ఎక్కడ వుంచటానికి వీలవుతుందో చూసుకుం టున్నాడు.

కింద అంతా ఆత్రంగా చూస్తున్నారు.

సెల్లా దృష్టి అంతా భారత్ మీద వుంది.

భారత్ దేవత మోకాలిమీదకు చేరుకున్నాడు. విగ్రహం నున్నగా వుండి జారుతోంది. ఇంతకుముం దెప్పుడూ చెయ్యని పని అవటంవల్ల యిబ్బందిగానే వుంది. ఐనా మనసంతా ఆ మణిమీదనే వుంది.

ఇప్పుడతని ధ్యేయం ఆ విలువైన మణి.

మనసులో కదులుతున్న అనేక ఆలోచనలను భయాన్ని పక్కకు నెట్టి దృష్టిని ఆ మణిమీదనే కేంద్రీక రించాడు.

విగ్రహం ముందువైపునే ఒకరికొకరు దగ్గరగా నిలు చున్నారు మిగిలినవాళ్ళు. ముసలాయన చేతిలో వంకీ కత్తి వుంది. ఆయన చీకట్లో దాన్ని తడిమి చూశాడు. బాగా పదునుగా వుంది. దారిలో యేదైనా జంతువు యెదురైతే ఆ కత్తితో దాన్ని నరికెయ్యగలడా?

ఉహు....తనకా శక్తిలేదు—ధైర్యంలేదు.

తను ఎన్నడూ అడవులకు వెళ్ళలేదు, యే జంతువుల తోనూ పోరాడలేదు. అటువంటి తనకు ఇక ఆ కత్తితో

ప నేమిటి? బ రు వు గా వుంది. దాన్ని పట్టుకోవటం యిబ్బందిగా వుంది.

అందుకే దాన్ని కిందికి వదిలాడు.

అది కిందవున్న బండరాయిమీద పడి ఖంగుమని చప్పుడయ్యింది.

ఆ చప్పుడుకు అంతా ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. చీకట్లోకి భయంగా చూశారు.

ఏమిటా చప్పుడు? ఎవరు చేశారు?

తెలీలేదు.

నిశ్చలంగా బొమ్మలా నిలబడి వున్నాడు ముసలాయన. తర్వాత యింకేదైనా చప్పుడు వినపడుతుందేమోనని యెదురు చూశారు.

స్టెల్లా — భారత్ కూడా ఆ ఖంగుమన్న చప్పుడును విన్నారు. భారత్ పైకి యెక్కబోతున్న వాడల్లా ఆగిపోయి కిందకు చూశాడు ఏమీ తెలీలేదు. స్టెల్లాను పిల్చి అడుగుదామనుకున్నాడు. కాని అంత యెత్తునించి కింద వున్న స్టెల్లాతో మాట్లాడాలంటే కొంచెం పెద్దగానే మాట్లాడాలి....

తర్వాత మళ్ళీ చప్పుడు కాలేదు.

నిమిషాలు గడుస్తున్నాయి.

గాలి ఒక్కసారి విసురుగా కొట్టింది.

ఏదో ఆలోచిస్తున్న స్టెల్లా ఒక్కసారి వణికిపోయింది. తెలియని భయంతో కంపించిపోయింది.

ఓ మై గాడ్!

మరోసారి గాలిని గట్టిగా పీల్చింది.

అవును, అవును.

సందేహం లేదు.

అదే....అదే వెగటు వాసన. భరించలేని వాసన. యెలక్ట్రిక్ స్మెల్ ....అంటే....ఇంకేం అంటే....

ఒక్క సెకనుకూడా వృధా చెయ్యలేదు.

కవ్వున గొంతు చించుకొని అరిచింది స్టెల్లా.

"భారత్ ....టకారాలు."

* * *

దారుణంగా అలుముకున్న నిశ్శబ్దాన్ని స్టెల్లా అరుపు ఛేదించింది. ఆ అరుపుతో దీవంతా మార్మోగిపోయింది.

మవునంగా నిల్చున్న వాళ్ళంతా స్టెల్లా అరుపుతో అదిరిపడి భయంతో తెలీకుండానే పిచ్చిగా కవ్వున అరిచారు.

స్టెల్లా అరుపు వినపడటంతోనే భారత్ ఒక రెప్ప పాటు కాలాన్నికూడా వృధా చెయ్యకుండా అంత ఎత్తు మీదనించి ఎగిరిదూకాడు.

ఐతే స్టెల్లా అంచనా తప్పుకాలేదు.

అప్పటికే చీకట్లో టకారాలు, వాళ్ళ నాయకుడు ఈటెలతో నిశ్శబ్దంగా యేమాత్రం అలికిడి రాకుండా వాళ్ళను సమీపించారు.

ఐనా ఆ వెగటు వాసన వాళ్ళ రాకను తెలియ పరిచింది.

అరుస్తూనే చుట్టూ వేగంగా తలతిప్పుతూ చూసింది. నాయకుడి ఇంటిముందునించి చిన్నగా వస్తున్న టకారాల ఆకారాలు అస్పష్టంగా కనిపించాయి.

దూకటంతోనే ముందుకుతూలి పడబోయాడు భారత్. బలవంతంగా నిలదొక్కుకున్నాడు.

"టకారాలు! పరిగెత్తండి. ప్రాణాలు కాపాడు కోండి. అంతా సముద్రతీరానికి."

అరిచాడు భారత్ ....

అంతే....

ఒక్కసారిగా చలనం....

ఎవరికివారే గుడ్డిగా ఆయుధాలతోనే ముందుకు పరుగుదీశారు.

భారత్ — సెల్లా దగ్గరకు వెళ్ళాడు. సెల్లా తన ప్రక్కనే నిశ్చేష్టురాలై వున్న స్త్రీ చేతిని పట్టుకొని విసురుగా లాగుతూ ముందుకు పరుగెత్తింది. ఆ విసురుకు ఆ స్త్రీ తూలిపడబోయింది. సెల్లా అరుపుకే ఆమెకు గుండె ఆగిపోయినట్లనిపించింది.

అల్లకల్లోలం....

అలజడి. నాగరికులు పారిపోతున్నారని టకారాలలో యెవరో బల్లెం విసిరారు. అది రివ్వున దూసుకువచ్చింది. అంత చీకట్లోనూ అది గురితప్పలేదు.

చావుకేక ....

ఎవరి వెన్నులోనో దిగబడింది.

ఆ చావుకేక ముందుగా పరుగుదీస్తున్న వాళ్ళను భయకంపితులను చేసింది. భయంతోనే కాళ్ళు కదల్లేదు. కాళ్ళకు మేకులు భూమిలోకి దిగ్గొట్టినట్టు అనిపించింది.

తప్పదు.

చావు భయం .... తమలో యెవరో ఒక మనిషి టకారాల బల్లేనికి ఆహారమయ్యాడు. ఆలస్యంచేస్తే తామూ టకారాల బల్లెం వేటుకు దొరక్క తప్పదు.

"పరుగెత్తండి....టకారాలు వెంట తరుముతున్నారు" అంటున్నాడు భారత్ ముందుకు పరుగుదీస్తూనే.

సెల్లా ముందుకు తూలిపడబోయిన ఆ స్త్రీని విసురుగా ముందుకు లాగింది. ఆ విసురుకు ఆమె బోర్లాపడబోయింది.

అరిచింది తన కాలికి బండ తగిలిందంటూ—

సెల్లా గొప్ప సందిగ్ధంలో పడిపోయింది. ఆ స్త్రీ తనతో సమానంగా పరుగుదీయలేక పోతోంది.

చీకటి, ముందు రెండడుగుల దూరంలో యేముందో సరిగ్గా కనపడటంలేదు.

ఐనా ముందుకు పరుగుదీస్తున్నారు ప్రాణభయంతో.

ఈ ఐదు రోజులనించీ భారత్ సముద్రతీరానికి వెళుతూ వస్తూ ఆ దారిని బాగా గుర్తుపెట్టుకున్నాడు. అందువల్లనే కళ్ళను చించుకొని చూస్తూ రివ్వున దూసుకెళుతున్నాడు.

ముందు దూసుకెళుతున్న భారత్‌ను చూస్తూ ఆ స్త్రీని లాగుతూనే పరుగుదీస్తోంది సెల్లా.

సెల్లాను వెనుక వస్తున్న వాళ్ళు అనుసరిస్తున్నారు.

వెనుక టకారాజాతి మనుషులు కీచకీచల భాషలోనే అరుస్తున్నారు— వెంట తరుముతూ....

భారత్‌కు చెమటలు క్రమ్మాయి. భయంతో వళ్ళు జలదరిస్తోంది. యిది వూహించని పరిణామం. పొరపాటున కూడా టకారాలు యిలా తమ పథకాన్ని తెలుసుకొని హఠాత్తుగా విరుచుకు పడతారని అనుకోలేదు.

ఇంతకీ టకారాలు తమ పథకాన్ని యెలా తెలుసుకున్నారు? ఎవరైనా చెప్పారా? ఎవరు చెబుతారు? ఒక్క ఆండ్రూస్‌కే ఆ అవకాశం వుంది.

ఆండ్రూస్ ఎందుకు చెబుతాడు? ఈ పథకం గురించి ఆయనేగ తమకు చెప్పింది! టకారాలు ఆండ్రూస్‌కు కూడా శత్రువులే.

అటువంటప్పుడు ఆండ్రూస్ తమ గురించి వాళ్ళకు ఎలా చెబుతాడు?

పొదల మధ్యనించి పరుగెత్తుతున్నాడు. పరుగెత్తుతూనే ఆలోచిస్తున్నాడు. ఆలోచనలను బలవంతంగా పక్కకు నెట్టేస్తున్నాడు.

ఇప్పుడు ఒక్కటే ఆలోచన.

వీలైనంత త్వరగా సముద్రతీరాన్ని చేరాలి.

తెప్పలమీద సముద్రంమీదకి వెళ్ళిపోవాలి.

ఇది సాధ్యమేనా? టకారాజాతి మొరటు మనుషులు తమని ప్రాణాలతో వదులుతారా?

స్టెల్లా ఆ స్త్రీని లాగుతోంది. ఆ స్త్రీ కాలికి దెబ్బ తగిలి అరుస్తోంది.... యేడుస్తోంది....

“నేను పరుగెత్తలేను. కాలికి నెత్తురు కారుతోంది.... నొప్పిగా వుంది.... ప్లీజ్.... నన్నొదులు.”

“యూ ఫూల్.... వెనుక ఆటవికులు తరుముతున్నారు ఈటెలతో.... క్షణం ఆలస్యం చేసినా మన ప్రాణాలు పోతాయి. క్విక్. పరుగెత్తు.... ప్రాణంకోసం పరుగెత్తు.”

ఊహూ.... ఎంత ప్రయత్నం చేసినా ఆ స్త్రీ పరుగెత్తలేకపోతోంది. అప్పటికే ఆమెకు రొప్పు వచ్చింది. ఆయాసంతో ఆమె గుండెలు యెగిరిపడుతున్నాయి.

అప్పటికే భరత్ వాళ్ళిద్దరికీ దూరంగా పరిగెత్తుతున్నాడు. అరుస్తున్నాడు స్టెల్లాను వేగంగా పరుగెత్తమని. స్టెల్లా పరిస్థితి దారుణంగా మారిపోయింది. ఆ స్త్రీతో వేగంగా పరుగెత్తలేకపోతోంది.

వెనుక వస్తున్న మనుషులు పిచ్చిపట్టినట్టుగా పరుగు దీస్తున్నారు. యెందువల్లనో టకారాలు నాగరికులంత వేగంగా పరుగుదీయలేక పోతున్నారు.

బహుశ ఆ రాత్రి దీవిలో సంచరించే కపాచీ దేవత గురించి వాళ్ళు జంకుతూ వుండొచ్చు. ఐనా వాళ్ళు

వెనుదిరిగి వెళ్ళలేదు.

వెంట తరుముతూనే వున్నారు అరుపులతో.

"సెల్లా క్విక్ ...."

దూరంనించి భారత్ అరుపులు వినపడుతున్నాయి.

అక్కడే పొదలు అంతమయ్యి పొడుగాటి చెట్లు మొదలవుతాయి.

ఊహించని విధంగా ఆ స్త్రీ ముందుకు బోర్లా పడిపోయింది. ఆమె చెయ్యి పట్టుకొని వుండటంతో సెల్లా కూడా ముందుకు పడబోయి ఆగిపోయింది.

ఆమెను లేవదీసేలోపలే వెనుకనించి వచ్చిన మనుషులు సెల్లాను నెట్టుకుంటూ ముందుకు వెళ్లారు.

మళ్ళీ వంగబోయింది సెల్లా....

కాని — ఇంతలోనే —

ఓ ఇద్దరు మనుషులు కిందపడిపోయిన ఆమె మీదనించి తొక్కుకుంటూ వెళ్ళిపోయారు. ఆమె బాధతో పెద్దగా ఆక్రందన చేసింది. ఒక మనిషి అడుగులు సరిగ్గా ఆమె గొంతుమీద పడ్డాయి.

కంగారుపడింది సెల్లా....

ఆమెకు ఏం చెయ్యటానికీ తోచలేదు. ఆ స్త్రీని వదలటం ఇష్టంలేదు. కాని —

ఇంతలోనే విసురుగా ఒక బల్లెం వచ్చి ఆ స్త్రీ మీద నించి చివరగా పరుగుదీసిన ఇద్దరి మనుషుల్లో ఒక మనిషి వెన్నులోకి సూటిగా — బలంగా చొచ్చుకుపోయింది.

రెండో చావుకేక ....

ఆ మనిషి బోర్లా పడిపోయాడు.

ఆ చావు కేకతో నిశ్శబ్దం చెదిరిపోయింది. ముందు పరుగెత్తుతున్న వాళ్ళంతా చలించిపోయారు. (సశేషం)